స్కెచ్

# పిల్లరాజు పౌరుషం

వల్లూరి కృష్ణారావు

కొన్ని కొన్ని సంఘటనలు మనల్ని చకితుల్ని చేస్తాయి. అవి చాలా సాధారణమైనవిగా కనిపించినా, అవి ఎక్కడా ఊహించడానికీ, అనుకోవడానికీ వీల్లేని అసాధారణపరిస్థితులకు ఈడ్చుకుపోతాయి. ఆ పరిస్థితుల్ని తట్టుకోవడం ఎలా ఉన్నా వాటిని విన్నవాళ్ళని ఆశ్చర్యంతో తల్లక్రిందులు చేస్తాయి. ఇలాటి సంఘటనలు విషమ పరిస్థితుల్ని ఎందుకు తెచ్చి పెడుతున్నాయో చెప్పలేక ఏదో సమాధానంగా కాలం, ఖర్మం అంటారు. ఈలాటి కాలం ఖర్మమే ఒకమాటు కలసిరాలేదు ఉమాపతికి.

ఉమాపతి చాలా మంచివాడు. నేను, నా స్నేహితులు ఎరుగున్నంత వరకూ, ఉమాపతి చాలా జాగ్రత్తగా మసులుకొని ఎట్టి పరిస్థితి నుంచైనా బయటపడ్డానికి ప్రయత్నిస్తాడు చాలా తెలివిగా. అసలు ఉమాపతి ఇరుక్కున్న సంఘటనా సందర్భాలూ విని మిగతా ఉపధ్యాయ సోదరులు దిగ్భ్రాంతులయ్యారు.

ఉమాపతి, ఒకరి విషయాలు ఎప్పుడూ తనవిగా చేసుకోడు. అలాగే పిల్లలకు ఎంత దూరంగా ఉండాలో అతనకి బాగా తెలుసు. వాళ్ళతో 'డీల్' చేసేటప్పుడు చాలాజాగ్రత్త తీసుకుంటాడు. ఇలాంటి ఉమాపతి ఒకమాటు చెడ్డకాలానికి బానిసయ్యాడు. ఖర్మకాకులై ఉమాపతి నెత్తిమీద తన్నినై.

ఉమాపతి ఒకమాటు పిల్లలకి 'హోమ్‌వర్కు' ఇచ్చాడు. ఇద్దరు పిల్లలు చెయ్యలేదు. ఎంతో శ్రద్ధతోనూ, 'సీరియస్'గాను ఇచ్చిన 'వర్కు'ను ఎగగొట్టిన ఇద్దరి పిల్లలమీదా తగనికోపం వచ్చింది ఉమాపతికి. కాని ఉమాపతి చాలా జాగ్రత్తగల మనిషి. ఉమాపతి తన కోపాన్ని తన ఆధీనంలో ఉంచుకోగలడు. ఇలాంటి భరించగలిగే శక్తి ఏ ఒక్కరి ఇద్దరిలో మాత్రమే ఉంటుంది. చాలా మంది ఉపాధ్యాయులకు పిల్లలకారణాలు వినే ఓపిక ఉండదు. వారి మొహాలు చూడగానే, వారి 'బక్కకోపం హద్దులు దాటుతుంది. వారి కోపం పరవళ్లు తొక్కుతుంది. పిల్లలమీద విరుచుకుపడతారు. పిల్ల నాయనలు బారుమంటారు. గోల పెడతారు. ఇలాంటి అఘాయిత్యపు పని ఎప్పుడూ ఉమాపతి చెయ్యలేదు; చెయ్యడు కూడా.

ఉమాపతికి కూడా కోపంవచ్చింది గాని, ఆ కోపం కళ్ళలోగాని నోటిలో కనపడలేదు. కోపం కూడిన శాంతంతో మాట్లాడతాడు. ఆ మాటలు చాలా నమ్రతగాను, అనునయంగాను బుద్ధి గరుపుతున్నట్లు ఉంటాయిగాని, కోపద్వేషాల ప్రకటితములు కావు. అందుకే పిల్లలు అంటారు "ఉమాపతి మేష్టారు ప చ్చి దే ము డ" ని. ఉమాపతి మామూలుగా అన్నాడు "ఏం నాయనా! చెయ్యలేదూ?" ఆ కుర్రాడు ఎంతో బిక్కుతూ, జాలిగా "జ్వరం" అన్నాడు. ఉమాపతికి ఈ జవాబు బాగానేవుంది. కొంత మంది కుర్రాళ్ళ నచ్చినట్లు అబద్ధాలు ఆడతారు. రెండో వాణ్ణికూడా అదే ధోరణిలో అడిగాడు. ఆ అబ్బాయి నిటారుగా నుంచున్నాడేగాని మాట లేదు. కారణం కనిపించలేదేమో వెధవాయికి!

"మా బామ్మ పోయిందండి" చెప్పు! కాని మాట్లాడితేగా! ఉమాపతికి మండిపోయింది. ఓర్పు పోగొట్టుకుంటున్నాడు ఉమాపతి. అంత ఇది గానూ ఉమాపతి తన జాగ్రత్తను మర్చిపోలేదు. ఆ అబ్బాయి మౌనం తనకేమీ కారణం లేనట్లు చెప్పుతోంది.

"వెధవ చదువు నువ్వూనూ వేరుశలక్కాయలు అమ్ముకోకూడదూ?" అంత కోపంలో ఇవే అంట. ఇదే వేయితలలపామై బుసలు కొట్టింది.

పిల్లలు ఘొల్లుమన్నారు. అభిమానంతో ఉడికిపోయాడు. కోపంతో ఊగిసలాడిపోయాడు.

దెబ్బతిన్న పులిలా కలియచూచాడు, పగబట్టి త్రోకమీద నుంచున్న త్రాచులా ఉమాపతి వంక చూసాడు. పుస్తకాలు చేతబుచ్చుకొని చరచర నడిచాడు బయటికి.

ఈ అపూర్వ సంఘటన ఉమాపతిని కలిచింది. ఆశ్చర్యపోయాడు. భయపడ్డాడు, బాధపడ్డాడు అభిమానవంతు డనుకున్నాడు. నిజంగా తాను తప్పుచేసినట్లు బాధపడ్డాడు. పశ్చాత్తాపపడ్డాడు. చెప్పకూడని కారణాలు అనేకం ఉండవచ్చు అని కూడా అనుకున్నాడు. నొక్కి-నొక్కి అడగడం తనది మంచిపని కూడాకాదు అనుకున్నాడు. కాని తన డిగ్నిటియో?

అంతతో ఆగితే బాగుండును. ఆ అభిమానవంతుడు రాజుగారి చిన్నకొడుకు. తండ్రితో జరిగింది చెప్పి బడికిపోనన్నాడు. అవునుమరి! పౌరుష జాతి పిల్లవీరుడు! పౌరుషం ఉరకలు వేసింది. రాజుగారి మీసాలు ఎగురుతున్నాయి. రాజుగారి కళ్ళలో అగ్ని వర్షించింది. బొంగురు గొంతుక కరినత్వం పోలున ప్రతిధ్వనించింది.

"ఎవరు వేరుశలకాయ లమ్ముతారో తెలియచేస్తా" అన్నారు. చాలు. మాటంటె జరిగి తీరాల్సిందే. ఉమాపతి ఖర్మ బ్రద్దలయింది. వేరుశలకాయల దుకాణం పెట్టిస్తాడు.

విన్న ఉమాపతి గతుక్కుమన్నాడు.

రెండురోజులయ్యింది. ఉమాపతికి సమను వచ్చింది. ఆశ్చర్యపోయాడు. సమను కాగితం చదువుకొని భయంతో వణికిపోయాడు. టీచర్సు గదిలో కూలబడ్డాడు. నల్భైమంది సాటిపిల్లల్లో పిల్లరాజు అభిమానం దెబ్బతినేలా మాట్లాడి పరువు పోగొట్టాడని అభియోగం. రాజుగారు పిలిపించి మందలిస్తారనుకున్నారుగాని క్లాసులోని ఉమాపతిని 'బోను' లోకి పిలిపిస్తాడని ఏ ఒక్కరూ అనుకోలేదు.

ఉమాపతి నాదగ్గరకు వచ్చాడు. నేనుకూడా ఆలోచించాను. ఉమాపతికి రావలసిన కష్టం కాదిది. వెంటబెట్టుకొని సరాసరి రాజుగారిదగ్గరకు వెళ్ళాను.

"పిల్లరాజుగారికి అభిమానం దెబ్బతింది. వాస్తవమే. ఉమాపతి ఎట్లాంటివాడో కాస్త ఆలోచించండి. ఎవర్నీ ఏమీ అనడు."

"పిల్లరాజు అబద్ధం ఆడతాడా?" రాజుగారి కోపం కట్టలు తెంచుకొంటే. ఛ! ఛ! తప్పు దెబ్బ పడిందనుకున్నాను.

"క్షమించమని కోరుతున్నాను" అన్నాను విధిలేక. రాజుగారి కంఠం అదేతీరులో నడిచింది. "వీల్లేదు. పిల్లరాజు చదువులేకపోయినా వేరుశనకాయలు అమ్మనక్కర్లేదు. మీ ఉమాపతి ఉద్యోగంపోతే..."

మామూలుగా ఉన్న ఉమాపతి ఒక్కమాటు మారిపోయాడు. ఉమాపతి గిర్రున తిరిగి ఫెళ్లున నేలకొరిగాడు. ఎంతో సేపటికిగాని తెలివి రాలేదు. రాజుగారే అన్నారు. పాపం! ఎలా అయినా దయార్ద్రహృదయులు.

"ఫరవాలేదు వెళ్ళండి. మావాణ్ణి కావలిస్తే కొట్టండి గాని మాటమాత్రం పడ్డు."

నాకు వెధవనవ్వు వచ్చింది. అప్రయోజకత్వపు నవ్వు నవ్వుతూ అన్నాను "ఇంకొహడు తనని మాటలు లక్ష అనమంటాడు. చెయ్యి మాత్రం ఉపయోగించద్దంటాడు. వివిధరకాలయిన మనస్థత్వాలు. వీళ్ళతో వేగాలి"శలవుతీసుకొనివచ్చాం.

ఉమాపతి వేడికాఫీ త్రాగితే నే గాని "అమ్మయ్య!" అని కూడా అనలేదు. చిత్రం! రాజుగారే రైటుచేసారు ఆ సమను వ్యవహారమంతా.

---

మోటారుకారు ప్రమాదంలో దెబ్బలు తగిలిన రోగిని ఆసుపత్రిలో నర్సు అడిగింది: "డబ్బు యిబ్బందివల్ల మీరు యిక్కడికి వచ్చేనన్నారే—అంటే ఏమిటి?"

రోగి: "రోడ్డు మీద నడుస్తూంటే ఒక అప్పులవాడు ఎదురొచ్చాడు: తప్పుకునేందుకు రోడ్డు అటుపక్కకి వెళ్ళబోతూంటే అవతల యింకో అప్పులవాడు! రోడ్డుమధ్య నిలబడిపోయాను—అంతే."